క్లుప్తంగా

నందీశ్వరునికి అభిషేకాలు



నందీశ్వరునికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తాళ్లరేవు: పవిత్ర త్రయోదశి, సోమవారం పర్వదినం సందర్భంగా నందీశ్వరునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. సుంకరపాలెం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి యున్న నందీశ్వరునికి అర్చకులు శ్రీకంఠం గిరిబాబుశర్మ మంత్రోచ్ఛారణల నడుమ పెంటా ఆదిమూర్తి దంపతులతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వీరేశ్వర స్వామికి పేరాబత్తుల కృష్ణ దంపతులు పంచ హారతులు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన



కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీధర్

తాళ్లరేవు: రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు రహదారి భద్రతపై అధికారులు అవగాహన కల్పించారు. రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా కోరంగి కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం 'రహదారి భద్రత- మన జీవన భద్రత' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కాకినాడ ఉప రవాణా కమిషనర్ కె.శ్రీధర్ హాజరయ్యారు. మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ హరినాథ్ రెడ్డి, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ పి.సాయిబాబు తదితరులు రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఘనంగా వేంకటేశ్వరుని కల్యాణం



వేంకటేశ్వరుని కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

తాళ్లరేవు: ప్రసిద్ధి గాంచిన పి.మల్లవరం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి రంగాచార్యుల నేతృత్వంలో చెల్లంకూరి సాదిత్య, సింధూజ దంపతులతో కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి సుబ్బారావు, శుభ, పుల్లయ్య, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి దివ్యాంగులకు ఉపకరణాల అంచనా శిబిరం

యానాం: యానాం పరిధిలో దివ్యాంగులకు సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఉచితంగా ఉపకరణాలు అందించడానికి ఈ నెల 11 నుంచి 14 వరకు వివిధ గ్రామాల్లో ముందస్తుగా అంచనా శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు సోమవారం ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. దివ్యాంగులకు కావాల్సిన పరికరాలను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తారన్నారు. 11న సావిత్రినగర్, గిరియాంపేట, దరియాలతిప్ప, దొమ్మేటిపేట గ్రామాల వారికి గిరియాంపేట హైస్కూల్ వద్ద, 12న కనకాలపేట, యుకెవినగర్, భీమ్‌నగర్ గ్రామాల వారికి కనకాలపేట ప్రభుత్వ హైస్కూల్ వద్ద, 14న పరంపేట, కురసాంపేట, అగ్రహారం, పెదపూడి వీధి వారికి ఎమ్‌జిజిబిహెచ్ హైస్కూల్ వద్ద ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి

కొత్తపేట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచనలను పరిగణలోకి తీసుకుని విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కే లీలావతి సూచించారు. పీఎం నరేంద్ర మోదీ ×పరీక్షా పే చర్చ₹ 2025 లో భాగంగా విద్యార్థులతో చేపట్టిన సంభాషణా కార్యక్రమాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు వీక్షించారు. మండల పరిధిలోని అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం మోదీ చెప్పిన విధంగా విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, యోగా, ధ్యానం చేయడం ద్వారా నిబద్ధత, సామర్థ్యం పెరిగి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. పరీక్ష అంటే భయపడకుండా మీ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాల్సిన సమయంగా భావించి ఆత్మ విశ్వాసంతో పరీక్షలను ఎదుర్కోవాలని ఉద్బోధించారు.

ప్రజారోగ్యంతో పరిహాసమా..!

- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- మొక్కుబడిగా స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్
- కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్న చెత్త
- పగలు, రాత్రి తేడా లేకుండా దోమల దండయాత్ర
- చోద్యం చూస్తున్న అధికారులు



అల్లవరం పోలీస్ స్టేషన్ సమీపంలో పేరుకుపోయిన చెత్త కుప్పలు



వీరన్నమెరకలో డ్రైనేజీ నిర్వహణ లేక స్తంభించిన మురుగు

అల్లవరం: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ఏ వీధిలో చూసినా కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన చెత్త దర్శనమిస్తోంది. ప్రధాన రహదారులు, వీధులు, ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం చెత్త కుప్పలు పేరుకుపోయాయి. గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణను గాలికొదిలేశారు. ప్రధాన రోడ్ల పొడవునా, వీధుల్లో చెత్త పేరుకుపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. పారిశుధ్య కార్మికులు ఉన్న పంచాయతీల్లో సైతం పారిశుధ్యాన్ని విస్మరించడం శోచనీయం. ఎక్కడ చూసినా అపరిశుభ్రతే తాండవిస్తోంది.

అలముకున్న నిర్లక్ష్యం

సమయానికి విధులకు వచ్చామా.. వెళ్లామా అనే ధ్యాసే తప్పా పనుల్లో జవాబుదారీ తనం కొరవడింది. పారిశుధ్యంపై అధికారుల నిర్లక్ష్య ధోరణి బాగా పెరిగింది. మండల స్థాయి అధికారులు సైతం పారిశుధ్యంపై పట్టించుకోవడం మానేశారు. స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఆర్భాటంగా నిర్వహించడం మరునాడే వదిలేయడం పరిపాటిగా మారిపోయింది. పారిశుధ్య నిర్వహణ మా బాధ్యత కాదు అన్నట్లుగా అధికారులు చేతులెత్తేశారు. డ్రైనేజీ వ్యవస్థ మారీ దారుణంగా ఉంది. మురుగునీరు వెళ్లే దారి లేక ఎక్కడికక్కడే నీరు స్తంభించిపోయి దుర్వాసన వస్తోంది. గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తా చెదారానికి తోడు దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తూ రోగాలకు గురి చేస్తున్నాయి.

అలంకారప్రాయంగా ఫాగింగ్ మెషీన్లు

డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు మెరుగుపరచి దోమల నియంత్రణకు ఫాగింగ్ యంత్రాలతో నిర్మూలించవలసి ఉన్నా ఏ పంచాయతీ పరిధిలోనూ అమలు కావడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పంచాయతీకి ఫాగింగ్ మిషీన్లు పంపిణీ చేశారు. నాటి ప్రభుత్వం పంపిణీ చేసిన ఫాగింగ్ మిషన్లు ఉపయోగించిన దాఖలాలు లేవు. ఇవి కేవలం అలంకార ప్రాయంగా పంచాయతీల్లో దర్శనమిస్తున్నాయి. చాలా పంచాయతీల్లో కనీసం ఒక్కసారి కూడా ఉపయోగించలేదంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అవగతమవుతోంది.

కార్మికులు ఉన్నా లేనట్లే..

అల్లవరం మండల పరిధిలోని 21 పంచాయతీల్లో 5 మేజర్, 17 మైనర్ పంచాయతీలు ఉన్నాయి. సుమారు 66 వేల జనాభాతో గ్రామాలు విస్తరించి ఉన్నాయి. ప్రతి వేయి మందికి ఒకరు చొప్పున పారిశుధ్య కార్మికులు ఉండాల్సి ఉంది. అల్లవరం, బోడసకుర్రు, కొమరగిరిపట్నం, కోడూరుపాడు, గుడాల పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు ఉన్నా గ్రామాల్లో సైతం అపరిశుభ్రత తాండవిస్తోంది. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చెత్త

> **త్వరలో అంబాసిడర్ల నియామకం**
>
> గ్రామాల్లో వారంలో రెండు సార్లు చెత్త చెదారాలను తొలగించి యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నాం. స్వచ్ఛాంధ్ర..స్వచ్ఛ దివస్ కార్యక్రమం ద్వారా పరిసరాల పరిశుభ్రతను పాటిస్తున్నాం. ప్రతి గ్రామంలో గ్రీన్ అంబాసిడర్‌ని నియమించాలని ఇటీవల అన్ని పంచాయతీలకు మార్గదర్శకాలను ఇచ్చాం. త్వరలో గ్రీన్ అంబాసిడర్ల నియామకం పూర్తయితే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయి.
>
> నాగేంద్ర, ఈఓపీఆర్‌డీ,
> అల్లవరం మండల పరిషత్ కార్యాలయం.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులకు సత్కారం



నంగవరంలో జిన్నూరి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న నాయకులు



సన్నవిల్లిలో వంగా గిరిజాకుమారిని సత్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా నియమితులైన నంగవరం సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన సన్నవిల్లి, నంగవరం ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజా కుమారిని పార్టీ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వంటిద్దు వెంకన్నాయుడు, ఓగూరి విజయ్‌కుమార్, శీలం సూరిబాబు, యాళ్ల చిన్నా, కల్వకొలను ఉమ, మోటూరి సత్యంకాపు, కోటుంలోవరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించి ఆదుకోండి

ఎమ్మెల్యే అశోక్‌కు రైతుల విజ్ఞప్తి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలోని దరియాలతిప్ప ఆయకట్టు పరిధిలో సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పంట పొలాలు ఎండిపోతున్నాయని తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలువురు రైతులు సోమవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. కనకాలపేట శివారు అరటికాయలలంక సమీపంలో ఏర్పాటు చేసిన పంపు హౌస్ వద్ద క్రాస్‌బండ్లు ఏర్పాటు చేయాలని కోరారు. కొంతకాలంగా సాగునీటి సమస్యపై అధికారులకు చెబుతున్నప్పటికీ ఫలితం లేదన్నారు. అనంతరం రైతులతో కలిసి పరిపాలనాధికారి కార్యాలయం వద్దకు వచ్చిన ఎమ్మెల్యే ఆర్ఏఓ మునిస్వామితో మాట్లాడారు. సాగునీటి సమస్యపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీటి కాలువల పనులు చేపడితే రైతులు సైతం సహకరించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో రైతులు తిరుకోటి భైరవమూర్తి, కోరుకొండ ఆనందరావు, సబ్బతి రాంబాబు, వాకపల్లి వెంకటేశ్వరరావు, గిడ్ల వెంకన్న, మట్టా రాంబాబు, మట్టా శ్రీను, ఆదిమూర్తి, సూర్యం, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపకాలు పదిలం



పాఠాలు చెప్పిన గురువులతో పూర్వ విద్యార్థినులు

అమలాపురం టౌన్: విభిన్న వృత్తుల రీత్యా వారంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక పేరుతో వారు చదువుకున్న పాఠశాలలో 20 ఏళ్ల తర్వాత కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను మళ్లీ పంచుకున్నారు. అమలాపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 2003–2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థినులు అదే పాఠశాలలో సోమవారం కలుసుకున్నారు. వీరంతా కుటుంబ సమేతంగా కలుసుకుని కమ్మని కబుర్లు చెప్పుకున్నారు. రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులకు సత్కారాలు చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని పూర్వ విద్యార్థినులు శ్రీదేవి, మహాలక్ష్మి, కల్యాణి, ప్రసన్న పర్యవేక్షించారు.

కృష్ణ కామేశ్వర్‌కు సత్కారం



కృష్ణ కామేశ్వర్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వరుసగా మూడు సార్లు చోటు సాధించిన అమలాపురానికి చెందిన నాణేలు, కరెన్సీ నోట్లు, తపాల బిళ్లల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్‌ను స్థానిక వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళా వాకర్స్ క్లబ్‌లు సోమవారం సత్కరించి అభినందించాయి. స్థానిక భూపయ్య అగ్రహారంలో జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణ కామేశ్వర్‌ను వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మిలు సత్కరించి రికార్డుల సాధనలో ఆయన చూపిన ప్రతిభను వివరించారు. వాకర్స్ జిల్లా బులిటన్ ఎడిటర్‌గానూ పనిచేస్తున్న కృష్ణ కామేశ్వర్ నాణేలు, కరెన్సీ నోట్లు, తపాల బిళ్లల సేకరణలో రికార్డులు సాధించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాకర్స్ జోనల్ చైర్‌పర్సన్ దువ్వూరి సుబ్బలక్ష్మి, వాకర్స్ ప్రతినిధులు బూరగాయల శివరామకృష్ణ, వలవల నాయుడు, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి, నూకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

అమలాపురం టౌన్: తన భర్త పితాని వెంకటేశ్వరరావు వరకట్నం కోసం వేధిస్తున్నాడని అతని భార్య సరస్వతీ దేవి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. భర్తపై ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

ఆల్బెండజోల్ జోష్



విద్యార్థులతో నులి పురుగుల నివారణ మాత్రలు మింగిస్తున్న కమిషనర్ రాజు

- నులి పురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ విజయవంతం
- పలుచోట్ల హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు

అమలాపురం టౌన్: నులి పురుగుల నిర్మూలనకు విద్యార్థులు ఆల్బెండజోల్-400 ఎంజీ మాత్రలను విధిగా మింగాలని అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు అన్నారు. ఈ మాత్రలతో నులి పురుగులు ఇట్టే మటుమాయం అవుతాయని చెప్పారు. స్థానిక నారాయణపేటలోని లాల్ బహదూర్ శాస్త్రి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల చేత కమిషనర్ రాజు నులి పురుగుల నివారణ మాత్రలను సోమవారం మింగించారు. నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీవీఎస్‌సీ పోలశెట్టి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లవరం: పిల్లల్లో రక్త హీనతకు కారణమయ్యే నులి పురుగులను నివారించేందుకు బెండమూర్లంక పీహెచ్‌సీ పరిధిలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశామని వైద్యాధికారి బాల సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని 24 అంగన్‌వాడీ కేంద్రాలు, 33 ఎంపీపీ పాఠశాలలు, ఓ కళాశాల పరిధిలో 4,411 మంది పిల్లలకు గానూ 4,112 మంది పిల్లలకు మాత్రలను వైద్య సిబ్బంది అందివ్వడం జరిగిందన్నారు. మిగిలిన వారికి ఈ నెల 17న పంపిణీ చేస్తామన్నారు

ఉప్పలగుప్తం: చిన్నారులకు తరచూ డీవార్మింగ్ చేసి నులి పురుగులను నివారించటంతో వారు మెరుగైన ఆరోగ్యం పొందుతారని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. జాతీయ నులి పురుగు నివారణా దినం సందర్భంగా మండలంలోని విలసవిల్లిలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో సోమవారం నులిపురుగు నివారణ మాత్రలను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఏఎన్ఎం అనురాధ, పుత్సల ఏసు తదితరులు పాల్గొన్నారు.



అల్లవరంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



విలసవిల్లిలో చిన్నారులకు నులి పురుగు నివారణ మాత్రలు వేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

డీఐఈవో సోమశేఖరరావు



అమలాపురంలో నులి పురుగుల నివారణకు పోస్టర్ విడుదల చేస్తున్న డీఐఈవో సోమశేఖరరావు

అమలాపురం టౌన్: జిల్లాలోని జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు నులి పురుగుల నివారణకు ఆరోగ్య శాఖ సిబ్బంది ద్వారా అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగిందని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి (డీఐఈవో) వనుము సోమశేఖరరావు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో జరిగిన మాత్రల పంపిణీ వివరాలను ఆయన అమలాపురంలో సోమవారం రాత్రి ఓ ప్రకటన ద్వారా విడుదల చేశారు. అమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో నులి పురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను డీఐఈవో విడుదల చేశారు. అనంతరం కళాశాలలోని విద్యార్థినులకు మాత్రలు పంపిణీ చేసి వారి చేత మింగించారు. ప్రతి కళాశాలలో ఈ పోస్టర్లను అతికించే ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నులి పురుగుల నివారణకు ప్రతి విద్యార్థి అల్బెండజోల్ మాత్రలు మింగడంతో పాటు గోళ్లను చిన్నవిగా ఉంచుకోవాలని సూచించారు. సోమవారం ఎవరైనా విద్యార్థులు ఆ మాత్రలను మింగకపోతే ఈనెల 17న జరిగే కార్యక్రమంలో మాత్రలను విధిగా తీసుకుని మింగాలని డీఐఈవో విజ్ఞప్తి చేశారు.

పొదుపుపై అవగాహన అవసరం



టగ్ ఆఫ్ వార్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

యానాం: పిల్లలపై తల్లిదండ్రుల ప్రభావం అధికంగా ఉంటుందని వారికి పొదుపు ప్రాధాన్యత, తదితర ఆర్థికపరమైన విలువలను నేర్పాల్సిన ఆవశ్యకత ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల యూనిట్ 1, 2 ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా 'ఫిట్ ఇండియా అండ్ ఫైనాన్సియల్ లిటరసీ' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేనేజర్ జి సుధాకర్, డిప్యూటీ మేనేజర్ సాయిరామకృష్ణ తదితరులు మాట్లాడారు. వచ్చే ఆదాయం బట్టి బడ్జెట్, పెట్టుబడి, సేవింగ్స్‌లను చేసే పద్ధతులపై వివరించారు.అంతకుముందు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు నిర్వహించిన టగ్‌ఆఫ్‌వార్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, అధ్యాపకులు శాంతికుమార్, రమేష్, తాతపూడి ముత్యాలు, ప్రోగ్రామ్ అధికారులు చెల్లే నరేష్, సుధాకర్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో అలసత్వం వద్దు



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ రవివర్మ

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలో వివిధ శాఖలకు సంబంధించి పన్నులను నిర్ణీత సమయానికి పూర్తి స్థాయిలో వసూలు చేయాలని కమిషనర్ పి.రవివర్మ సిబ్బందికి సూచించారు. నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి పన్నుల వసూళ్లపై నిర్వహించిన సమీక్షకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆదాయ పన్ను రూ.1.56,00,000కు గానూ ఇప్పటి వరకు రూ.1.0100,000 వసూలు చేశామని, వాటర్ టాక్స్ రూ.37,00,000కు గానూ రూ.5,00,000లు, ఖాళీ స్థలాల పన్నులు రూ.9,00,000లకు గానూ రూ.5,20,000లు వసూలు చేయడం జరిగిందన్నారు. ఆదాయ పన్ను వసూలు మార్చి నెలాఖరుకు నూరుశాతం పూర్తి కావాలని ఆదేశించారు. వాటర్ టాక్స్ వసూలు మరీ తక్కువగా ఉన్నందున బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు.


బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి



బ్రహ్మోత్సవాల కరపత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆలమూరు: చింతలూరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి జరగనున్న ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ తెలిపింది. స్థానిక ఆలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అల్లంరాజు రామకృష్ణమూర్తి, ద్విభాష్యం కాశీ విశ్వనాథశర్మ, అల్లంరాజు భరణీకుమార్ ప్రసంగించారు. టీటీడీ తరహాలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పాంచాహ్నిక పద్ధతిలో ఐదు రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నామన్నారు. ఈనెల 17న శేష వాహనం, 18న గరుడ వాహనం, 19న గజ వాహనం, 20న హనుమత్ వాహనం, 21న కల్పవృక్ష ముత్యాల పందిరి వాహనంలో దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈనెల 22న జరిగే పూర్ణాహుతి కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో వేంకటేశ్వర సన్నిధిలో బ్రహోత్సవాల కరపత్రికను ఆవిష్కరించారు. వెల్ల సత్యనారాయణ, పసలపూడి శ్రీనివాసు, నామాల రామకృష్ణ, ఆలయ పురోహితులు పివివిఎస్.ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల వికాసానికి తోడ్పాటు



ఆలమూరులో బాలికా వికాసంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, ఐడీసీఎస్ అధికారులు

ఆలమూరు: కిశోరి బాలికల వ్యక్తిత్వ వికాసామే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలకు తోడ్పాటును అందించాలని ఎంపీడీఓ ఏ రాజు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులో ఉన్న బొబ్బా జయశ్రీ బాలికల ఉన్నత పాఠశాల సోమవారం కిశోరి వికాసం కార్యక్రమం జరిగింది. గ్రామ అంగన్‌వాడీ సమాఖ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీఎస్‌వీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొని కిశోరి బాలికల వికాసానికి తీసుకోవలసిన చర్యలపై ప్రసంగించారు. అనంతరం ఇప్పటికే నియమించిన వెల్ఫేర్ అసిస్టెంట్, అంగన్‌వాడీ కార్యకర్త, ఉపాధ్యాయుడు, మహిళా పోలీసు బృందం హైస్కూల్ ఆవరణలో విద్యార్థినులతో సమావేశమై కిశోరి వికాసం ఆవశ్యకతను వివరించారు. వైద్యాధికారి డి.సాయికిశోర్, ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.